క్లుప్తంగా

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



వ్యాస రచనలు రాస్తున్న విద్యార్థినులు

పుత్తూరు: గ్రంథాయల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక మెయిన్ స్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మీనాకుమారి మాట్లాడుతూ పుస్తక పఠనం, పోటీ పరీక్షలతో విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వ్యాస రచన పోటీల్లో స్థానిక కాపువీధిలోని ఎంపీయూపీ స్కూల్, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు భువనేశ్వరి, మురళీ కృష్ణ, మల్లిక పాల్గొన్నారు.

రాజయ్యకు నివాళి



రాజయ్యకు నివాళి అర్పిస్తున్న రాజేష్

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట గ్రామానికి చెందిన గురువారం మృతి చెందిన రాజయ్యకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్.రాజేష్ శుక్రవారం గ్రామంలో పర్యటించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి కుటుంబ పరిస్థితిపై వాకబు చేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు రామయ్య, మాజీ సర్పంచ్ హనుమంతరెడ్డి, మునిరెడ్డి ఉన్నారు.

వైభవంగా కార్తీక పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప సన్నిధి

నగరి: పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి సన్నిధిలో తమిళ కార్తీక మాస ఆరంభ పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు భక్తులు అయ్యప్ప మాలధారణ చేశారు. శనివారం శబరియాత్రకు వెళ్లే భక్తులు ఆలయంలోని అయ్యప్ప, వినాయక, సుబ్రమణ్య స్వామి విగ్రహాలను, పద్దెనిమిది మెట్లను సుందరంగా అలంకరించగా అందరినీ ఆకట్టుకుంది. అయ్యప్ప పాటలతో ఆలయ ఆవరణలు మార్మోగాయి. అయ్యప్ప భక్తులు అందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో మణి ఆచారి, మదన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విష్ణు ప్రతిభ



పాలసముద్రం : శ్రీసత్య సాయి సేవ ఆర్గనైజేషన్స్ వారు నిర్వహించిన ఆచార్య దేవోభవ వ్యాస రచన పోటీల్లో పాలసముద్రం ప్రభుత్వం ఉన్నత పాఠశాల విద్యార్థి విష్ణు ద్వితీయస్థాయిలో నిలిచినట్లు శుక్రవారం ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, గిరిజ తెలిపారు. పాలసముద్రం హైస్కూల్ హెచ్‌ఎం మీనాక్షి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో తెలుగు మాధ్యమ విభాగంలో జరిగిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థి విష్ణు రెండో స్థానంలో నిలిచాడన్నారు. విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోండి



ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

వెదురుకుప్పం: పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని చవటగుంటలో డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. నిత్యం పుస్తక పఠనం చేయడం అలవరుచుకోవాలన్నారు. గ్రంథాలయ ఆధునికీకరణకు కంప్యూటర్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయంలో అన్ని రకాల పుస్తకాల అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రభాకరరావు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ వెంకటేష్, గ్రంథాలయ అధికారి సతీష్‌కుమార్, పీడీ భరణినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

నగరి ప్రజలకు పాదాభివందనం

- వై నాట్ 175
- 2024లో జగనన్న వన్స్‌మోర్
- పుట్టిన రోజు వేడుకల్లో మంత్రి రోజా భావోద్వేగ ప్రసంగం
- శుభాకాంక్షలు తెలిపిన మంత్రి అంబటి, టీటీడీ చైర్మన్ భూమన



మంత్రి రోజాకు ఆత్మీయ స్వాగతం



మంత్రి ఆర్‌కే రోజాకు గజమాల వేసి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు, అభిమానులు

పుత్తూరు: కార్యకర్తల ఉత్సాహం, నాయకుల ప్రోత్సాహం, ప్రజల అభిమానం చూస్తుంటే 2024లో జగనన్న వన్స్‌మోర్, వై నాట్ వన్ సెవెన్టీ ఫైవ్ అంటూ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక యువజన క్రీడా శాఖా మంత్రి ఆర్కే రోజా చేసిన ప్రసంగానికి ఫంక్షన్ హాలు హర్షధ్వానులతో హోరెత్తింది. తన ఉన్నతికి కారకులైన నగరి ప్రజలందరికీ పాదాభివందనం అంటూ భావోద్వేగం వ్యక్తం చేశారు. శుక్రవారం మంత్రి రోజా పుట్టిన రోజు వేడుకలు తిరుపతి జిల్లా పుత్తూరులోని జీవీఆర్ ఫంక్షన్ హాలులో అట్టహాసంగా జరిగాయి. ఈ వేడుకలకు రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి హాజరై మంత్రి రోజాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన రాజకీయ లక్ష్యాన్ని చేరుకోవడంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని తెలిపారు. ఈ క్రమంలో తనకు రాజకీయ దారి చూపిన కరుణాకర రెడ్డిని, తనకు పూర్తి సహకారం అందించిన ముఖ్యమంత్రి జగనన్నను, భర్త సెల్వమణి, తన అన్నదమ్ములను ఎన్నటికీ మరువనని మంత్రి రోజా అన్నారు. జగనన్న నాయకత్వంలో పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా తాము ఈ సంక్షేమం, అభివృద్ధి చేశామంటూ ప్రజల వద్దకు వెళ్లిన దాఖలాలు లేవని, అలాంటిది నేటి జగనన్న ప్రభుత్వంలో గడప గడపకు వెళ్లి చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ధైర్యంగా చెప్పగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చే స్పందన చూస్తుంటే రానున్న ఎన్నికల్లో జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం అన్నారు. మంత్రి రోజా భర్త రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు.

పడిలేచిన కెరటం రోజా..

తన సహచర మంత్రి రోజా పడిలేచిన కెరటమని మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రోజా పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. ఎందరో సినీతారలు రాజకీయాల్లోకి ఇలా వచ్చి అలా వెళ్లినవారేనని, కానీ రోజా మాత్రం అలా వెళ్లే మనస్తత్వం కాదని నిరూపించుకున్నారని కొనియాడారు. ఆమె ఎప్పటికీ వాడిపోని రోజా పువ్వు అన్నారు.

ఆమె సంకల్పం దృఢమైనది

మంత్రి రోజా రాజకీయ సంకల్పం దృఢమైందని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అన్నారు. ఆమె ఎప్పుడూ ప్రజల కోసం పరితపిస్తుంటారని కొనియాడారు. నగరి ప్రజలకు ఆమె సేవలు నిరంతరం ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.







మంత్రి రోజా జన్మదిన వేడుకల్లో కళాకారుల నృత్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు, ఫంక్షన్ హాల్ బయట కోలాటాలు వేస్తున్న కళాకారులు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి



నగరి: నాగుల చవితి సందర్భంగా కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

నగరి: పట్టణ పరిధిలో నాగులచవితి వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. శివాలయాలు, నాగదేవత ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. ఓంశక్తి ఆలయం సమీపంలో ఉన్న నాగదేవత ఆలయంలో స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. బాలాజీ గోల్డెన్ సిటీలోని వరసిద్ధి వినాయక రాహు, కేతు శక్తి నాగాలమ్మ ఆలయంలో ఉదయం నుంచే మహిళల సందడి కనిపించింది. పూజా సామగ్రితో వెళ్లిన మహిళలు నాగదేవతకు ఆచారం ప్రకారం పూజలు చేసి మర్రి చెట్టుకు రక్ష కట్టారు. పుట్టపై పసుపు, కుంకుమ చల్లి పాలు, గుడ్డు వేసి నైవేద్యం సమర్పించారు. అలాగే ఆలయాల వద్ద అన్నదానం చేశారు. పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంతేశ్వర ఆలయానికి విచ్చేసిన భక్తులు కరకంతేశ్వర స్వామికి, నాగదేవతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. దేశమ్మ ఆలయంలోని నాగదేవత ప్రతిమకు అభిషేకం చేసి, పసుపు, కుంకుమలు అద్ది కర్పూర హారతులు ఇచ్చారు. సంప్రదాయం ప్రకారం నాగదేవత ప్రతిమల చుట్టూ రక్షా బంధనాలు చుట్టారు. అలాగే మున్సిపల్ పరిధి కొత్తపేటలోని నాగదేవత ఆలయంలో నాగులచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. 1008 మహిళలు ఈ పూజల్లో పాల్గొనడం ప్రత్యేకతను సంతరించుకుంది. మంత్రోచ్చరణల నడుమ మహిళలు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. సాయంత్రం శివభక్తులచే తిరువాసగం పారాయణం జరిగింది.

నింద్రలో

నింద్ర: మండలవ్యాప్తంగా నాగుల చవితి సందర్భంగా నాగులమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. నింద్రలో మహిళలు నాగుల పుట్ట వద్ద పసుపు, కుంకుమ, ప్రసాదాలు సమర్పించారు.

వెదురుకుప్పంలో

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంట, దేవళంపేట గ్రామాల్లో ప్రజలు నాగుల చవితిని ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పుట్ట వద్ద పాలు, గుడ్లు పెట్టి నాగాలమ్మకు నైవేద్యంగా సమర్పించారు. అనంతరం భక్తి ప్రపత్తులతో ప్రసాదాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ఓంశక్తి ఆలయం వద్ద ..

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలవ్యాప్తంగా గ్రామాల్లో మహిళలు శుక్రవారం నాగుల చవతి పూజలు ఘనంగా చేశారు. శ్రీబొమ్మరాజుపురం, పాలసముద్రం బీసీ కాలనీ సమీపంలో ఉన్న పుట్టకు పసుపు, కుంకుమ పెట్టి పూజలు చేపట్టారు. బలిజ కండ్రిగ చెవుటిగంగమ్మ ఆలయంలో నాగాలమ్మ విగ్రహాల వద్ద మహిళలు పిండిదీపాలు, వంటలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: నాగులచవితి వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం మండలంలో నాగులమ్మ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై ఆర్కేవీబీపేట సమీపంలో వెలసిన నాగాలమ్మ పుట్ట వద్ద మహిళా భక్తులు పుట్టకు నూలు చుట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేపట్టారు. అదేవిధంగా అమ్మవారికి ఇష్ట ప్రసాదమైన సజ్జలు, నూగులతో తయారు చేసిన ప్రసాదంతో పాటు, నల్లగాజులు సమర్పించి కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అమ్మవారికి కానుకలు సమర్పించారు. అలాగే యువత ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేపట్టారు. అదే విధంగా స్కంధపుష్కరిణి సమీపంలో వెలసిన శ్రీరాజరాజేశ్వరీ దేవీ ఆలయ ఆవరణలో వెలసిన 16 అడుగుల పుట్టకు కార్వేటినగరం వాసులు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.



నగరి: బైపాస్ మలుపు వద్ద నాగదేవతకు పూజలు



పాలసముద్రంలో..

పుస్తక పఠనంతో విజ్ఞానం

కార్వేటినగరం: పుస్తక పఠనంతోనే జ్ఞానం, విజ్ఞానం కలుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకపఠనంపై గ్రంథాలయ అధికారి అన్నశగన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కార్వేటినగరం గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు మాట్లాడుతూ కళాశాలలోని గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు, మహిళలకు సంబంధించిన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం ఉత్తమ పుస్తక పాఠక విద్యార్థులకు బహుమతులను అందించారు. అలాగే శంకర్‌బాబును ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, అధ్యాపక బృందం శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాల సుబ్రమణ్యం ఆచారి, సీఎస్ లత, సుబ్బారావు, హరిబాబు, శివరామకృష్ణ, బాబు, కార్తీక్, రాజశేఖర్, స్వామిశివయ్య పాల్గొన్నారు.



గ్రంథాలయ అధికారి శంకర్‌బాబును సన్మానిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి

గంజాయి కేసులో ముగ్గురికి రిమాండ్

తిరుపతి లీగల్: రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న కేసులో ముగ్గురికి 15 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన బి.విజయ్, భూపతి వాసు, తిరుపతి బైరాగిపట్టెడ భగత్ సింగ్ కాలనీకి చెందిన జె.వెంకటేష్‌లను రేణిగుంట పోలీసులు అరెస్ట్ చేసి శుక్రవారం రాత్రి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.

సైన్స్ సెంటర్‌లో విజ్ఞాన వీచికలు

తిరుపతి కల్చరల్: బాలల దినోత్సవం సందర్భంగా తిరుపతి బాలోత్సవం వారి సహకారంతో బాలల సైన్స్ ఫెస్టివల్‌లో సైన్స్ విజ్ఞానం వెల్లివిరిసింది. రెండు రోజులపాటు సైన్స్ సెంటర్‌లో విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్స్, సైన్స్ ఇతివృత్తంగా నాటక ప్రదర్శనలతో శుక్రవారం బాలల ఫెస్టివల్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి టీటీడీ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.దేవేంద్రబాబు హాజరయ్యారు. విద్యార్థులు సుమారు 50కిపైగా సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ అండ్ మ్యాథమేటిక్స్ వంటి అంశాలపై ప్రదర్శించిన నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. శనివారం కూడా సైన్స్ సెంటర్‌లో ఈ బాలల సైన్స్ ఫెస్టివల్ కొనసాగుతుందని ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాయల దామోదరం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నదానం

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి చెందిన రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో చిత్తూరుకు చెందిన దాతలు తేజ, భవ్య కుటుంబ సభ్యులు శుక్రవారం ఆలయంలో వందమందికి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్ మాట్లాడుతూ స్వామివారి దర్శనం కోసం ఇతర మండలాల నుంచి వచ్చి పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. ఇలా ప్రతి భక్తుడు ముందుకువచ్చి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో పాలు పంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో తేజ, భవ్య కుటుంబ సభ్యులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేపడుతున్న దాతలు

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోండి



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న డిపో మేనేజర్ ప్రశాంతి

పుత్తూరు: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రశాంతి కోరారు. శుక్రవారం వడమాలపేటలో ప్రజలకు కార్గో సేవలపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు పట్టణాలకే పరిమితమైన కార్గో సేవలను ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు విస్తరించినట్లు తెలిపారు. మండల కేంద్రాల్లో ఏజెన్సీల ద్వారా కార్గో డోర్ డెలివరీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. తక్కువ ఖర్చుతో సకాలంలో మీ పార్సిల్ మీ ఇంటి వద్దకే చేరుతుందని వివరించారు. పట్టణాల్లో కార్గో సేవల ద్వారా పార్శిళ్లను రవాణా చేయాలని కోరారు.

సకాలంలో కుల గణనను పూర్తి చేయండి



మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనింగ్ ఆఫీసర్ చిన్నారెడ్డి

గంగాధర నెల్లూరు: మండలంలో కులగణనను త్వరగా పూర్తి చేయాలని జిల్లా మాస్టర్ ట్రైనింగ్ ఆఫీసర్ చిన్నారెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏపీ రాష్ట్ర కులగణన సమావేశాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి కుటుంబ సభ్యుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి సకాలంలో కులగణన పూర్తి చేయాలని సూచించారు. జీడీ నెల్లూరు, పాలసముద్రం మండలాలకు సంబంధించిన ఎంపీడీఓలు, మండల స్థాయి అధికారులకు ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో గంగాధర్ నెల్లూరు, పాలసముద్రం మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



ప్రసంగిస్తున్న కవులు

తిరుపతి అర్బన్: 56వ గ్రంథాలయ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకొని గోవిందరాజస్వామి దక్షిణ మాడవీధిలోని ప్రాంతీయ ప్రభుత్వ గ్రంథాలయంలో శుక్రవారం ఉదయం కవి సమ్మేళనం చేపట్టారు. భారత స్వతంత్ర పోరాటం ప్రధాన అంశంగా సాగిన ఈ కవి సమ్మేళనానికి సభాధ్యక్షులుగా డాక్టర్ నేమిలేటి కిట్టన్న వ్యవహరించారు. ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దమన నీతి మొదలుకొని మొదటి సైనిక తిరుగుబాటు నుండి మహాత్మా గాంధీ సారధ్యంలో అహింసా మార్గంలో భారతీయులు ఉద్యమ బాటలో స్వతంత్రాన్ని సాధించిన విధివిధానాలను ప్రస్తావించారు. ప్రముఖులను చివరిగా సన్మానించారు. డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, డాక్టర్ కలువగుంట రామమూర్తి, ప్రముఖ కథా రచయిత, కవి పేరూరు బాల సుబ్రమణ్యం, రచయిత సురేంద్ర రొద్ద, గ్రంథాలయాధికారి సత్యనారాయణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి



వనదుర్గాపురం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం: మండల పరిధిలోని అన్ని సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా సమయపాలన తప్పకుండా పాటించాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. శుక్రవారం ఆమె కృష్ణజమ్మపురం, వనదుర్గాపురం సచివాలయాలను సందర్శించారు. వనదుర్గాపురం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సకాలంలో విధులకు రావడం లేదని, సకాలంలో కార్యాలయాన్ని కూడా తెరవడం లేదని ఫిర్యాదులు వస్తున్నట్లు తెలిపారు. ఇలాంటివి పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల సమస్యలను గ్రామాల్లోనే పరిష్కరించేందుకే ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. అందువల్ల సచివాలయ సిబ్బంది బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. అనంతరం ఆమె సచివాలయంలో ఇంతవరకు ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, వాటిల్లో పరిష్కరామైనవి ఎన్ని అని పంచాయతీ కార్యదర్శి జయశంకర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులకు తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైభవంగా స్కంధ షష్ఠి ఉత్సవాలు

నగరి: పట్టణ పరిధిలోని కరకంతేశ్వర స్వామి ఆలయంలో స్కంధ షష్ఠి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సుబ్రమణ్యంస్వామికి వీరభద్రుడి అలంకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి పుష్పాలంకరణ, ఆలయ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు దుర్గాప్రసాద్ సుబ్రమణ్య స్వామికి వీరభద్రుడి అలంకరణ చేపట్టి భక్తుల దర్శనార్థం ఆలయ మండపం వద్ద ఉంచారు. ఈ అలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి హారతి పూజలు, ఊంజల్ సేవ నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఉభయదారులకు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలోని చింతలపట్టెడ వల్లీదేవసేనా సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో కూడా స్కంధ షష్ఠి వేడుకలను వైభవంగా నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్య స్వామి

శ్రీదేవి సేవలు ఎనలేనివి



శ్రీదేవిని సన్మానిస్తున్న నేతలు, అధికారులు

గంగాధరనెల్లూరు: ఎంపీడీఓగా నాలుగేళ్ల పాటు ప్రజలకు విశేష సేవలందించి పదోన్నతిపై వెళ్తున్న శ్రీదేవి సేవలు ఎనలేనివని ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ లక్ష్మీప్రియ అన్నారు. గంగాధర నెల్లూరు మండల ఎంపీడీఓగా పనిచేసి జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీగా పదోన్నతిపై వెళ్తున్న శ్రీదేవికి శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘన వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎంపీపీ అనిత మాట్లాడుతూ కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో, తుపాన్ల సమయంలో మండల అధికారులను సమన్వయం చేసుకుని ప్రజలకు సేవలు అందించారని కొనియాడారు. తహసీల్దార్ ఇన్బనాథన్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుధాకర్, వైస్ ఎంపీపీలు హరిబాబు, బేబీ, నాయకులు సురేంద్ర రెడ్డి, వేల్కూర్ బాబు రెడ్డి, సర్పంచులు ఏకాంబరం, మునిరాజు రెడ్డి, జిల్లా రైతువిభాగం అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఆర్‌బీకే అడ్వైజర్ కమిటీ అధ్యక్షుడు బాబు రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ రాజా, ఎంఈఓలు ఆంజనేయులుశెట్టి, గుణశేఖర్ రెడ్డి ఉపాధి హామీ ఏపీఓ శ్రీనివాసులు, వెలుగు ఏపీఎం చిరంజీవి, ఈఓపీఆర్డీ రాఘవేంద్ర రాజు పాల్గొన్నారు.

చిన్నపిల్లల ఆసుపత్రిలో ఘనంగా బాలల దినోత్సవం

తిరుపతి తుడా: రుయా ఆసుపత్రి చిన్న పిల్లల విభాగంలో ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్, రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ జి రవిప్రభు, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో చాచా నెహ్రూ జన్మదినోత్సవం పురస్కరించుకొని, చిన్నపిల్లల దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా కళ్లజోళ్లు అందించారు. వినికిడి లోపంతో బాధపడుతున్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి హియరింగ్ ఎయిడ్ వినికిడి పరికరాలు అందజేశారు. అనంతరం చిన్నపిల్లలకు, తల్లిదండ్రులకు రంగుల పోటీలు, బొమ్మల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణురాలు డాక్టర్ వినీషా, డాక్టర్ ప్రదీప్, పారామెడికల్ సిబ్బంది, మేనేజర్ డాక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



నింద్రలో చీరలు పంపిణీ చేస్తున్న నాయకులు

నింద్ర: మండల కేంద్రమైన నింద్ర గ్రామంలో శుక్రవారం మంత్రి రోజా జన్మదినాన్ని పురస్కరించుకుని చీరలు పంపిణీ చేశారు. దాత వేలూరు రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు 800 మందికి చీరలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామ్‌లాల్ మాట్లాడుతూ మంత్రి రోజా జన్మదినం అంటే అందరికీ పండుగలాంటిదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభ, సర్పంచ్ వసంతమ్మ, మాజీ ఎంపీపీ మలరమ్మ, మండల కన్వీనర్ వేణురాజు, నాయకులు పాల్గొన్నారు.